క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పూజలు



కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాలలో ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ పూజలు నిర్వహించారు. ఆలయంలో సీతారామ లక్ష్మణుల విగ్రహాలతో పాటు, ఆలయం ఎదుట ధ్వజస్తంభం ప్రతిష్ఠించనున్న సందర్భంగా ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

గుండాల ఉత్సవాలకు ఎంపీకి ఆహ్వానం



వెల్దండ: మండలంలోని గుండాలలో అంబారామలింగేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలకు నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవికి హైదరాబాదులో ఆదివారం ఉత్సవ కమిటీ సభ్యులు కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ నెల 25వ తేదీ నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ సందీప్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మోతీలాల్ నాయక్, పర్వత్‌రెడ్డి, శేఖర్, పుల్లయ్య, అంజయ్య, ఆలయ అర్చకులు నరహరి, సంతోష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని కేవీపీ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు ఆదివారం సాధన స్టడీ హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. స్టడీ సెంటర్ నిర్వాహకుడు నవీన్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎస్సార్ శంకరన్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ సతీష్‌కుమార్ హాజరై మాట్లాడారు. ఒత్తిడిని జయించాలని, ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తే లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో సదానందం గౌడ్, రాజేందర్, శ్రీనివాస్, నాగరాజు, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫర్నిచర్ కొరత

పెద్దకొత్తపల్లి: పెద్దకొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి సరిపడ ఫర్నిచర్ లేకపోవడంవతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవలే కొత్తగా తహసీల్దార్ కార్యాలయ భవన సముదాయాన్ని రూ.1.70 కోట్లతో కార్యాలయ నిర్మాణాన్ని చేపట్టారు. విశాలమైన గదులు, ప్రజల అవసరాల నిమిత్తం సరిపడ ఫర్నిచర్ లేకపోవడంతో కార్యాలయంలో ప్రజలు నిల్చొని పనులు చేయించుకుంటున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ జేకే మోహన్‌ను వివరణ కోరగా ఫర్నీచర్ కొరతను జిల్లా అధికారులతో పాటు రాష్ట్ర ఎక్సైజ్ శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

మహిళా సంఘాల బలోపేతానికి కృషి



తాడూరు: మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేస్తునట్లు ఏపీఓ బాలచందర్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల మహిళా సంఘాల సభ్యులకు ఆదివారం మండలంలోని చెర్లఇటిక్యాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్పీలు మాట్లాడుతూ సంఘాలకు పంచ సూత్రాలు, మొండిబకాయిలను వసూలు చేయడం, సంఘంలో లేని మహిళను గుర్తించి కొత్త సంఘాలను తయారు చేయడం, గ్రామైక్య సంఘంలోని సభ్యులకు వ్యక్తిగత పాస్ పుస్తకాలు, వివిధ అంశాలపై శిక్షణ ఇస్తునట్లు పేర్కొన్నారు. సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎనిమిది రోజుల పాటు శిక్షణ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలతో పాటు వివోఏలు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడులు రాక పరేషాన్

- వేరుశనగ రైతులకు తప్పని తిప్పలు



దిగుబడి లేక నూర్పిడి చేయకుండా ఉంచిన వేరుశనగ కుప్ప



వీరంరాజుపల్లి వద్ద వేరుశనగ పంట తీస్తున్న కూలీలు



రామాజిపల్లిలో సాగు చేసిన వేరుశనగ పంట

బల్మూర్: ఆరుగాలం సాగు చేసి పండించిన పంట ఆశించిన మేర దిగుబడి రాక పోవడంతో రైతన్నలు దిగాలు చెందుతున్నారు. మండల వ్యాప్తంగా రైతులు రబీలో 12,714 ఎకరాల్లో వేరుశనగ పంటలు సాగు చేశారు. ఎకరాలకు సుమారు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. ప్రస్తుతం కనీసం ఆరు క్వింటాళ్లు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. దీంతో పంట సాగుకు పెట్టిన పెట్టుబడులు కూడా మీద పడి అప్పులే మిగిలాయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌కు అమ్మడానికి తీసుకెళ్తే కనీస మద్దతు ధర కూడా లేక పోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు.

ముసురు వర్షాల ప్రభావంతోనే..

ఈ ఏడాది అక్టోబరు మాసంలో రైతులు వేరుశనగ విత్తనాలు వేసిన తర్వాత కురిసిన ముసురు వర్షాల ప్రభావంతో పంటల దిగుబడి తగ్గడానికి కారణమా లేక మూడు నెలల్లోనే పంట వచ్చే నాసిరకం విత్తనాల ప్రభావం ఉండవచ్చని రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సగటున ఎకరా వేరుశనగ పంట సాగుకు సుమారు రూ.40వేల వరకు ఖర్చులు కాగా ఎకరాకు ఆరు క్వింటాళ్ల దిగుబడి వస్తే రూ.30వేలు కూడా చేతికి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా తగ్గిన దిగుబడితో రైతులు ఒక పక్కా దిగాలు చెందుతుంటే మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా వేరుశనగ పంటలపై కోతుల దండయాత్రలో మరోపక్కా తమ బాధలు చెప్పుకోలేక పోతున్నారు. ఏది ఏమైన ఈ ఏడాది వేరుశనగ పంటలు సాగు చేసిన రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందని చెప్పొచ్చు. ప్రభుత్వం రైతులకు కనీస మద్దతు ధరతోనైనా ఆదుకోవాలని కోరుతున్నారు.

పెట్టుబడి రావడం లేదు..



మూడు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశాను. రూ.1.40 లక్షలు పెట్టుబడి అయ్యింది. పంట దిగుబడి సగానికి సగం తగ్గింది. లొట్ట బుడ్డలు ఉన్నవి. పెట్టుబడిలో డబ్బులు కూడా రాలేదు.

–గండు నాగయ్యగౌడ్, రైతు, కొండనాగుల

ముసురు ప్రభావంతోనే..

ఈ సారి అక్టోబర్–నవంబర్ మాసాల్లో కురిసిన వర్షాల వల్ల వేరుశనగ పంటలు తెగుళ్లతో దెబ్బతిని పంటల దిగుబడి తగ్గింది. ఇందులో చాలా వరకు పల్లీలు లొట్టలు ఉన్నవి. మండల వ్యాప్తంగా సాగు చేసిన పంటల్లో గరిష్ఠంగా సగానికి మించి దిగుబడులు రాలేదు. –నరేష్‌కుమార్, ఏఓ, బల్మూర్

సంత్ సేవాలాల్ జీవితం ఆదర్శం



సంత్ సేవాలాల్‌కు సాంప్రదాయ పూజలు చేస్తున్న బంజారాలు

మన్ననూర్: సంత్ సేవాలాల్ జీవితం ఆదర్శమని ఎంఈఓ రామావత్ రామారావు అన్నారు. బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ 286వ జయంతిని మన్ననూర్ గ్రామంలోని ఉమామహేశ్వర కాలనీలో ఆదివారం నిర్వహించారు. తండా పెద్ద రామావత్ రామారావు (ఎంఈఓ) ఇంటి ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో తండావాసులు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ సంత్ సేవాలాల్ బంజారాల సంస్కృతి, ధర్మ పరిరక్షణ, ఆధ్యాత్మిక భోదనలతో పాటూ మూఢ నమ్మకాలను రూపుమాపడం మాంసం మత్తు పదార్థాలు కాకుండా శాఖహారం మాత్రమే ఆహారంగా తీసుకోవాలని ఎన్నో హిత బోధనలు చేశారని గుర్తు చేశారు. ఓ ప్రత్యేక వాహనంలో సేవాలాల్ చిత్రపటాన్ని ఊరేగించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శ్రీరాం, మంగమ్మ, ఉద్యోగులు సూర్య నాయక్, లాల్‌సింగ్, తిరుపతి, రాజు, శ్రీను నాయకులు రాజారాం, గోపాల్, చంద్రు, హాతీరాం, తుల్చ, తదితరులు పాల్గొన్నారు.

దళిత ఉద్యోగులను బ్లాక్‌మెయిల్ చేయడం సరికాదు

అచ్చంపేట రూరల్: ఇన్‌చార్జ్ ఎంఈఓ జీవన్‌కుమార్‌పై కొందరు చేసిన అసత్య ఆరోపణలను మాల ఉద్యోగుల ఐక్యవేదిక డివిజన్ అధ్యక్షుడు కల్ముల ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. పట్టణంలోని సాయినగర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో విధులు సక్రమంగా నిర్వర్తించని వారు కుట్రతో పాఠశాల హెచ్‌ఎం జీవన్‌కుమార్‌ను ఉద్దేశపూర్వకంగా బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని తెలిపారు. వారి ఆరోపణలో ఎలాంటి వాస్తవం లేదని పేర్కొన్నారు. నిరాధారణమైన ఆరోపణలు చేస్తూ లబ్ధిపొందాలని చూస్తున్నారని వివరించారు. జీవన్‌కుమార్‌పై పెట్టిన అక్రమ కేసును ఉపసంహరించుకోవాలని కోరారు.

మన్ననూర్: అచ్చంపేట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్ ఎంఈఓ జీవన్‌కుమార్‌పై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి మద్దెల దివాకర్ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సకాలంలో విధులకు హాజరుకావాలని ఉపాధ్యాయులను హెచ్చరించడంతో కొందరు ఉద్దేశపూర్వకంగా హెచ్‌ఎంపై అసత్య ఆరోపణలకు తెరలేపారన్నారు. దళితుడు హెచ్‌ఎం, ఎంఈఓగా కొనసాగుతుంటే కింది స్థాయి ఉద్యోగులు జీర్ణించుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉపాధ్యాయుల తీరు మార్చుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదును ఉపసంహరించుకోవాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

చారకొండ: యువతి, యువకులు సైబర్‌నేరాలపై, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని చారకొండ ఎస్‌ఐ శంషొద్దీన్ అన్నారు. మండల కేంద్రంలో జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాల్లో ప్రయాణిస్తున్న విద్యార్థులతో మాట్లాడి అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు చెప్పొద్దన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. వాహనసదారులకు సంబంధిత పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఐ శంషొద్దీన్

ప్రతిభా పరీక్షలు విద్యార్థులకు ఉపయోగకరం

అచ్చంపేట రూరల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతిభా పరీక్షలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని గెజిటెడ్ హెడ్మాస్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల ఆవరణలో పదోతరగతి విద్యార్థులకు టీపీటీఎఫ్ జిల్లా కమిటీ, అచ్చంపేట డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిభా పోటీ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ప్రతిభా పరీక్షలు విద్యార్థి జ్ఞానాభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు. పలు పాఠశాలల నుంచి 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు బషీర్ అహ్మద్, బుచ్చయ్య, విష్ణుమూర్తి, ప్రధానోపాధ్యాయులు బాలస్వామి, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్, ఉపాధ్యక్షుడు ఊషన్న, పర్వతాలు, కార్యదర్శి అజాహర్, కుర్మయ్య, నిఖిల్, రాజు, ప్రశాంత్, రమేష్, జేమ్లా, లింగమయ్య పాల్గొన్నారు.

ఘనంగా మదర్సా వార్షికోత్సవం

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని మదర్సా ఇస్లామియా ఫజల్ –ఉల్– ఉలూమ్ అరబీ పాఠశాల 30వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జామే నిజామియ అరబీ యూనివర్సిటీ మౌలానా ఖాజి హాఫీజ్ అల్లా అమీర్ శర్పీ హాజరై మాట్లాడారు. ప్రవక్తా జీవితం ఆదర్శమన్నారు. కార్యక్రమంలో అబ్దుల్లా ఖాన్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ రఫీయోద్దీన్, ముషా విరత్ కమిటీ ఉపాధ్యక్షుడు, మీలాద్ కమిటీ అధ్యక్షుడు షేక్ యాకుబ్ బావజీర్, హఫీజ్ మొహమ్మద్ ఇర్షాద్ ఆలం, కమిటీ సభ్యులు ముస్తాఖ్ అహ్మద్, అబ్దుల్ అలీం, మహమ్మద్ యూసుఫ్, సయ్యద్ అహ్మద్, ఇస్మాయిల్ ఖాన్, మహమ్మద్ ఖాజా, అరిఫ్ హుస్సేన్, సమద్, మునవ్వర్, తాహేర్‌లతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఖాజీ హాఫీజ్ అల్లా అమీర్ శర్పీ

మైసమ్మ దేవతకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లిలో వెలిసిన మైసమ్మ దేవతను ఆదివారం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వంకేశ్వరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ అభిమాని తిరుపయ్య అసెంబ్లీ ఎన్నికల్లో డాక్టర్ వంశికృష్ణ ఎమ్మెల్యేగా గెలుపొందాలని మొక్కుకున్నాడు. ఈ మేరకు అభిమాని కోరిక మేరకు అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకుని మొక్కలు చెల్లించాడు. ఎమ్మెల్యేను మైసమ్మ చైర్మన్ శ్రీనివాసులు, ఈఓ రామేశ్వర్ శర్మ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో తిరుపతయ్య, దశరథం, మల్లికార్జున్, అనిల్ కుమార్, సుబ్బదాసు, హరికృష్ణ, విజ్జు, ప్రవీణ్, రంజిత్ పాల్గొన్నారు.

ఎంపీ ఈటలకు సన్మానం

కల్వకుర్తి రూరల్: పార్లమెంటు సభ్యుడు ఈటెల రాజేందర్‌ను ఆదివారం కల్వకుర్తిలో బీజేపీ నాయకులు సన్మానించారు. సగర శంఖారావం కార్యక్రమానికి వెళ్తున్న సందర్భంగా రాజేందర్ కల్వకుర్తికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని రాజేందర్ కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్, బోడ నరసింహ, నరెడ్ల శేఖర్ రెడ్డి, బాబీ దేవ్, రవి గౌడ్, సురేందర్ గౌడ్, వివేకానంద, గంగాధర్ చారి, కిష్టారెడ్డి, విజయ్, రాజేందర్, సదానందం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కొల్లాపూర్: పట్టణంలోని శ్రీకృష్ణ నగర్ కాలనీలో ఇటీవల అనుమానస్పదస్థితిలో విద్యార్థి గనమోని కౌశిక్(15) మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నాయకులు బి.నారాయణ యాదవ్, కె.శంకర్, మహేష్‌బాబు, వేణుమాధవ్‌గౌడ్, కురుమయ్య, కుమారస్వామి, వసంతకుమార్, జనవిజ్ఞానవేదిక డివిజన్ అధ్యక్షుడు ఎండీ మహిమూద్, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రబ్బానీపాషా ఉన్నారు.

శునకానికి అంత్యక్రియలు

బల్మూర్: మండలంలోని రామాజిపల్లి గ్రామానికి చెందిన మాధంశెట్టి స్వామి ఐదేళ్ల కిందట గజ్వేల్ నుంచి రాడ్‌విల్లర్ జాతికి చెందిన దేశీయ సంతతికి చెందిన కుక్కను కొనుగోలు చేసి అల్లారుముద్దుగా పెంచుకున్నాడు. ఆదివారం అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో యాజమాని, కుటుంబసభ్యులు బోరున విలపించారు. సంప్రదాయబద్ధంగా శునకానికి అంత్యక్రియలు నిర్వహించారు.

సంఘం బలోపేతానికి కృషిచేద్దాం

పాన్‌గల్: మాదిగ ఉద్యోగుల జాగృతి సంఘం బలోపేతానికి అందరం కృషి చేద్దామని మాదిగ ఉద్యోగుల జాగృతి సంఘం జిల్లా కన్వీనర్ ఆది వెంకట్, సంఘం సభ్యులు మురళీ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ముందు సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

క్రీడా ప్రాంగణాలు నిరుపయోగం



జమ్మాపూర్‌లో అడవిని తలపిస్తున్న క్రీడా ప్రాంగణం

పాన్‌గల్: యువతలో ఉన్న క్రీడా స్ఫూర్తిని వెలికితీసేందుకు వీలుగా మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలు నిర్మించింది. గ్రామాల్లో నిర్మించిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేయడం, కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో ఆటలు ఆడక వెలవెలబోతున్నాయి. గ్రామాల్లో పిల్లలు, యువతకు నేటికీ సరైన మైదానాలు లేక ఆటలకు దూరమవుతున్నారు. క్రీడల పట్ల ఆసక్తి పెంచాలనే లక్ష్యంతో ఏర్పాటు చేయగా ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది. కనీస సౌకర్యాలు కల్పించి మార్పులు చేస్తే వేసవి నాటికి యువత, పిల్లలు ఆటలు ఆడేందుకు అనువుగా ఉంటాయని పలువురు వాపోతున్నారు. మండల కేంద్రంతో పాటు 28 గ్రామ పంచాయతీలలో క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితం కావడంతో పిచ్చిమొక్కలు పెరిగి అడవిగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాలను ఆడుకునేందుకు అనువుగా మార్చాలని క్రీడాకారులు కోరుతున్నారు.

చౌడేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న మర్రి



చౌడేశ్వరీ అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

బిజినేపల్లి: మండల కేంద్రంలోని చౌడేశ్వరి దేవి అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. యాదవుల ఆరాధ్య దైవం అయిన అమ్మవారి ఉత్సవాలను బిజినేపల్లి యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. మాజీ ఎంపీటీసీ బాలస్వామి మర్రి జనార్దన్‌రెడ్డిని ప్రత్యేకంగా స్వాగతం పలికి సన్మానించారు. తీర్థ ప్రసాదాలు అందజేసిన అర్చకులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మహేశ్వర్ రెడ్డి, మంగి మురళీ తదితరులు పాల్గొన్నారు.

నాయకుడికి పరామర్శ

తెలకపల్లి: మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ మండల నాయకుడు రెడ్డపాకుల శివశంకర్‌ను ఆదివారం మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి పరామర్శించారు. శివశంకర్‌పై పెట్టిన అక్రమ కేసును ఎత్తేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట తెలకపల్లి మాజీ ఉపసర్పంచ్ కృష్ణయ్యతో పాటు స్వేరోస్ నాయకులు ఉన్నారు.

కార్యకర్తలకు దిశానిర్దేశం

తిమ్మాజిపేట: ఈనెల 18న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అమనగల్‌కు రానుండటంతో ఆదివారం మండల నాయకులకు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. స్వంత వాహనాలతో పాటు, అవసరమైన ఇతర వాహనాలు సమకూర్చుకొని ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు తరలిరావాలని కోరారు. మండల అధ్యక్షుడు జోగు ప్రదీప్, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు గోపిగౌడ్, హర్య, మాజీ డైరెక్టర్ హుస్సేనీ, నాయకులు కొత్త వెంకటేష్, జగన్‌రాజ్, మల్లేష్, నాగేశ్వర్, పాండు, రమేష్ పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన



నాగర్‌కర్నూల్ క్రైం: మండలంలోని గగ్గలపల్లి ఆరోగ్య ఉప కేంద్రాన్ని సోమవారం జాతీయ నాణ్యత ప్రమాణాల పరిశీలన ప్రత్యేక బృందం సందర్శించనున్నారు. ఆదివారం ఆరోగ్య ఉప కేంద్రంలో పెద్దముద్దునూరు వైద్యాధికారి డా.వాణి ఏర్పాట్లను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు, సూచనలు చేశారు. రోజువారి రికార్డులతో పాటు వాక్సినేషన్ రికార్డులను అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. హెల్త్ ప్రొవైడర్లు డా.నీరజ్‌కుమార్, డా. ప్రీతి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల కరపత్రాలు విడుదల



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలో లక్ష్మీపద్మావతివేంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆలయ చైర్మన్ కల్వ మనోహర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23, 24, 25 తేదీలలో బ్రహ్మోత్సవాలను భక్తులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రెటరి హరికృష్ణ, శేఖర్, గంధం ప్రసాద్, కృష్ణయ్య, సంతు యాదవ్, గుబ్బ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

భారీ బైక్ ర్యాలీ



కల్వకుర్తి రూరల్: జిల్లా కేంద్రంలో నిర్వహించే సగర శంఖారావానికి కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ పరిధి నుంచి నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఆదివారం వివిధ మండలాల నుంచి కల్వకుర్తి సంఘం కార్యాలయం వద్దకు చేరుకున్న సగరులు కల్వకుర్తి పట్టణం పురవీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వివిధ వాహనాలలో తరలి వెళ్లారు. సగర సంగం జిల్లా కోశాధికారి పడకంటి రాజు సాగర్ తో పాటు పలువురు సంఘం నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మవిశ్వాసం

కల్వకుర్తి రూరల్: కరాటేతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడమ సత్యం అన్నారు. ఆదివారం ఉదయం కళాశాల ఆవరణలో కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులను ఆయన కలిసి వారి లోని నైపుణ్యాలను పరీక్షించారు. చదువుతో పాటు కరాటేలో రాణించాలని సూచించారు. కార్యకర్తలు, మాస్టర్లు ఉన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి



తిమ్మాజిపేట: మండల కేంద్రానికి చెందిన దానం కాశమ్మ(106) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. స్థానిక నాయకులు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులతో పాటు పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



హాజరైన రేవల్లి జెడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులు



అమ్రాబాద్‌లో..

నాగర్ కర్నూల్: వనపర్తి జిల్లా రేవల్లి జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో 1988–89 పదో తరగతి చదివిన పూర్వ ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని హిమాలయ రెస్టారెంట్‌లో సమావేశం అయ్యారు. 36 సంవత్సరాల తర్వాత ఒకచోట కలుసుకోవడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరిస్తూ పాఠశాలలో గడిపిన క్షణాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి గురువులు మక్బుద్ద వల్లి, విష్ణువర్ధన్ రావు, నరసింహారెడ్డి, జానకిరామ్ రెడ్డి, రాఘవరెడ్డి, నాగం వెంకట్ రెడ్డి, చెన్నకేశవరెడ్డి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్రాబాద్: అమ్రాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో1991–92 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఉద్యోగ, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అప్పటి గురువులు సత్యనారాయణ, రఘుపతిరావు, జగాల్‌రెడ్డి, శ్రీనివాసులును సన్మానించారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎనిమిది ట్రాక్టర్ల పశుగ్రాసం దగ్ధం

తిమ్మాజిపేట: మండలంలోని గొరిటలో ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తు ఎనిమిది ట్రాక్టర్ల పశుగ్రాసం దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు ఎర్పుల అరవింద్ వ్యవసాయ పొలంలో గడ్డివాములను ఏర్పాటు చేశాడు. పక్క పొలం నుంచి మంటలు వ్యాపించి ప్రమాదవశాత్తు గడ్డివాముకు అంటుకున్నాయి. ఫైర్ సిబ్బంది ఫైరింజన్ వచ్చే వరకు పశుగ్రాసం అగ్నికి ఆహుతైంది. పశుగ్రాసం విలువ రూ.80 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది